# మకన్నటికి అర్థం తెలుసా?

'శమైతాంగి'

"అమ్మా!" విసురుగా లోపలికి వచ్చాడు సూర్యం.

హడావిడిగా తన బట్టలు సర్దుకుంటున్న నరసమ్మ గారు దిగ్గున తల ఎత్తి, "ఉత్తరం వచ్చిందా, పెద్దాడి దగ్గర్నుంచి? ఎప్పుడు రమ్మనమని వ్రాశాడు? రేపే ఓ టెలిగ్రామ్ కొట్టు, నేను బయలుదేరి వస్తున్నానని—లేకపోతే కొత్తచోటు, అవస్థపడాలి" అంది ఉత్సాహంతో గబగబా.

"టెలిగ్రామ్ కొట్టేపని లేదులే ఇక." వ్యంగ్యంగా నవ్వుతూ అక్కడున్న కుర్చీలో చతికిల బడ్డాడతను.

"ఏం? ఎందుకని? వాడే వస్తానని వ్రాశాడా నన్ను తీసుకెళ్లడానికి?" ఆదుర్దాగా అడిగిందామె.

"వాడొస్తాడని కాదు, నిన్ను పంపించవద్దని ..."

"నన్ను పంపించవద్దనా?" ఆ మాట వింటూనే ఆమె తెల్లబోయింది.

"ఎందుకని?" క్రుంగిపోతూ అడిగిందామె.

"ఎందుకేమిటి? నీకు అక్కడ సదుపాయంగా ఉండదని. వాళ్లు మేడమీది భాగంలో ఉంటున్నారట. ఆ మెట్లు దిగలేక, ఎక్కలేక నీకు అవస్థగా ఉంటుందని—పైగా అక్కడ చలి బాగా ఎక్కువగా ఉందట. నీకయ్యే మూణ్నెల్ల ఖర్చు డబ్బు రూపంలో పంపిస్తాడట నాకు. నిన్ను ఇక్కడే ఉంచమని వ్రాశాడు నీ పెద్ద కొడుకు." చివరి మాటని వెటకారంగా ఒత్తి పలికాడు సూర్యం.

"నన్ను రావద్దన్నాడా? చలికి తట్టుకోలేనని, మేడమెట్లు దిగలేనని — పాపం, వాడికి నా మీద ఎంత ప్రేమో! పైగా నా తిండి ఖర్చు నీకు పంపిస్తాడా?"

ఏడవలేక నవ్వినట్లు పేలవంగా నవ్విందామె. "అక్కడికి వెళ్లబోతున్నానని ఈ క్షణం వరకూ ఉవ్విళ్లూరుతున్నాను. పైగా అందరికీ చెప్పేశాను కూడా— రేపో మాపో ప్రయాణమవుతున్నాను, మా పెద్దాడి దగ్గరకు హైదరాబాదు అని." గొణుక్కుంది బాధగా. ఈవేళొస్తుంది, రేపొస్తుంది ఉత్తరం అని తను ఆశగా ఎదురు చూస్తుంటే, తన ఆశల్ని ముక్కలుచేస్తూ వచ్చిన ఉత్తరం తెచ్చిన కబురు ఆదన్న మాట. నరసమ్మ గారికి నవ నాడులూ క్రుంగిపోయినట్లు ఎంతో బాధ అనిపించింది. ఆఫీసరుగా హోదాతోపాటు, బోలెడంత డబ్బు గడిస్తున్న పెద్దకొడుకు దగ్గర కొన్నాళ్లు నిశ్చింతగా ఉండచ్చని, అటు పక్కన ఉండే ఊళ్లన్నీ చూడవచ్చని కలలు



కంటున్న దిన్నాళ్ళూ. ఆ కలలన్నీ కల్లలై పోయాయి నేటికి—అనుకుంది బరువుగా నిశ్వసిస్తూ.

ఉత్తరంలోని వార్త తల్లికి జేరవేశారు కాబోలు పిల్లలు, కోడలు కనకమహాలక్ష్మి అత్తగారి ప్రయాణం ఆగిపోయినందుకు, ఆ బరువు ఇంకా మూణ్ణెల్లు పెరిగినందుకు బాధపడిపోతూ, ఆ బాధని గిన్నెల మీదా, చెంబుల మీదా చూపిస్తూ గట్టిగానే గొణుక్కుంటున్నది — "మాయదారి సంత నా కొచ్చిపడింది" అంటూ.

కోడలి విసుగుదల ఎందుకో, ఎవరి మీదో తెలుసుకోనంత అమాయకురాలు కాదు నరసమ్మగారు. కాని, ఏం చేస్తుంది? భర్త పోతూ పోతూ చేసి పోయిన ఏర్పాట్లవి. 'నలుగురు కొడుకులూ ఒక్కొక్కరు . సంవత్సరంలో మూణ్ణెల్లు తల్లిని పోషించా'లని. ఆ లెక్క ప్రకారం ఇక్కడి కొచ్చి మూణ్ణెల్లు పూర్తయి పైన మరో మూడు రోజులు కూడా గడిచిపోయాయి. గుమాస్తాగిరితో, పట్నం బ్రతుకుల్లో, రోజురోజుకీ విపరీతంగా పెరిగి పోతున్న ధరలతో ఉన్నవాళ్ళే చాలకు బ్రతుకుతుంటే, కరువుకి తోడు అధిక మాస మన్నట్లు మరో మనిషిని పోషించాలంటే ఈ రోజుల్లో చాలా కష్టమే. ఎంత హీనంగా లెక్క వేసినా తన గురించి నెలనెలా ఎంతో కొంత ఖర్చు కాకపోదు. తను లేకపోతే ఆ డబ్బు వాళ్ళకి ఆదాయే కదూ? పైగా కోడలు కనకమహాలక్ష్మి ఏ పెంకావెం, ఇరుగు పొరుగుల దగ్గర — "మా అత్తగారి మూలాన్నే అంత ఖర్చు" అని వాపోతూ ఉండటం తను చూస్తూనే ఉన్నది. ఇక్కణ్నుంచి తనని ఎంత త్వరగా సాగనంపుదామా అని వాళ్ళు కంగారు పడుతుంటే, తన బరువు ఇంతలో తీరదని వాళ్ళకి బాధ. నిజమే మరి. భృకుటి ముడిచి దీర్ఘాలోచనలో పడిపోయా రామె. ఆవిడ కెటూ పాలుపోవడం లేదు. పోనీ, విష్ణుమూర్తి దగ్గిర కెళితే? తను వెళ్ళాలే గాని తనని పువ్వుల్లో పెట్టినట్లు ఆదరంగా చూసుకొనేది వాడొక్కడేను. "వచ్చావా, అమ్మా? చాలా ఆలస్యం చేశావేం? నువ్వొస్తావనిరోజూచూస్తూనే ఉన్నాను" అని నోరారా నవ్వుతూ ఎదుర్కొంటాడు. గడువు పూర్తిచేసి ప్రయాణం అవబోతుంటే, "అప్పుడే వెళతావా? మొన్ననే కదూ వచ్చావు? అప్పుడే మూణ్ణెల్లూ అయిపోయాయా! అయితే అయ్యాయి లెమ్మూ. లెక్క ప్రకారం ఉండాలని నియమమేమిటి? కాసిని రోజులు ఎక్కువుంటేనేం? నీది మరీ చాదస్తం. నాన్నగారు ఏ కొడుకు

**స్త్రీ సంతానం కోసం ఎంత గానో అర్రులు చాస్తుంది. పిల్లలకై పూజలు, వ్రతాలు, తీర్థ యాత్రలు కూడా చేస్తుంది. తన కడుపున కాచిన కాయల రక్షణకోసం ముఖాన్ని సైతం పణంగా ఒడ్డుతుంది. క్షణ క్షణం కొడుకు ఔన్నత్యం కోసం తపిస్తుంది. పెరిగి పెద్దవాడైన తరవాత తల్లి తన్నిటికి కారకుడు కొడుకే అయితే....**

మనమూ నొచ్చుకో కూడదని ఆ నిర్ణయం చేసి ఉంటారు, అంతమాత్రానికే కట్టుబడి పోవాలా?" అని బాధపడిపోతాడు. దాన్నిబట్టే వాడికి తనంటే ఎంత ప్రేమో గ్రహించుకోవచ్చు.

"నాన్నమ్మా, నువ్వు ఊరెళ్ళడం లేదట కదూ?" మూర్తి చిన్న కొడుకు నరసమ్మ గారి చెయ్యి పట్టుకుని లాగుతూ అడిగాడు. ఉలిక్కిపడిం దామె. ఆలోచనలు చెదిరిపోయాయి. "ఊహూ వెళ్ళడం లేదు" అనబోయింది. అంతలోనే తమాయించుకుని — "ఎవరు చెప్పా రలా? లేదు, వెళుతున్నా. మీ విష్ణు బాబయ్య దగ్గిరకి వెళుతున్నా" అన్నా రావిడ నవ్వు నటిస్తూ.


"ఉత్తదే." వాడు నమ్మలేనట్లు చూశాడు.

అంతలోనే పక్కింటి కామాక్షమ్మ హడావిడిగా వస్తూ, "మీ ప్రయాణం ఆగిపోయిందట కదూ, వదినా? మీ లీల మా కోడలితో చెపుతుంటే ఎంతవరకు నిజమో కనుక్కుందామని వచ్చాను" అంది.

"అవును. మా పెద్దాడి దగ్గరికెళ్ళడం లేదు. ఆఖరాడి దగ్గరకు వెళదా మనుకుంటున్నాను" అనాలనుకున్నా రావిడ—కాని, ఎదుటి మనిషి చెప్పే జవాబుతో నిమిత్తం లేని కామాక్షమ్మ గబగబా అంది: "అయితే ఇంకేం? ఎలాగూ ప్రయాణం ఆగిపోయింది గనక అలా రామాలయం వరకు వెళ్దాము రండొదినా. ఈవేళక్కడ పురాణ కాలక్షేప ముందట."

ఆవిడ పురాణ కాలక్షేపం వంకతో పిలిచినా అది వినవివ్వకుండా తన సొంత గాథాయణం కాలక్షేపం చేసే ఆమెతో వెళ్ళడం ఇష్టం లేకపోయినా, ఇంట్లో ఉండి కోడలు రుసరుసలు, కొడుకు విసుగుదల వింటూ బాధపడేకన్న ఆవిడతో బయటికి వెళ్ళడమే ఉత్తమంగా కనిపించి — "సరే, పదండి" అంటూ అమట్నుంచ బయలుదేరింది నరసమ్మగారు, కామాక్షమ్మ వెనకాల. దారిలోనే తన స్వంత రామాయణం మొదలు పెట్టింది కామాక్షమ్మ. చిన్న కొడుకు మళ్ళీ ఉత్తరం రాశాడట తనని రమ్మనమని. కాని, అక్కడికి వెళ్ళడం తనకే ఇష్టం లేదట. పైగా పెద్ద కొడుకు కూడా — ఇప్పుడు ఎందుకు? వెళ్ళచ్చులే తర్వాతెప్పుడో అన్నాడట. ఆ మాట చెపుతూ, "నా కొడుకుల్ని నేను మెచ్చుకో కూడదని, ఏ దానం చేసి ఈ బిడ్డలను కన్నానో గాని, రత్నాల మొలకలు కదూ నా పిల్లలు! ఈ కాలంలో ఉండాల్సిన పిల్లలు కాదు నా కొడుకులు. నేనంటే వాళ్ళిద్దరికీ ఎంత ఆపేక్షో! ప్రాణం విడుస్తారు నేనంటే" అంది కామాక్షమ్మ. ఎప్పుడు చెప్పినా ఈమాటలే చెబుతుంది విసుగులేకుండా. కాని, రోజూ ఆ మాటల్నే వింటున్న నరసమ్మ గారికి ఆ రోజు అకారణంగానే ఆమెమీద కోపం, అంత అదృష్టానికి నోచుకున్న ఆమె అదృష్టాన్ని చూసి అసూయా ముంచుకొచ్చాయి. కాని ఏం చేస్తుంది? అదావిడ అదృష్టం. ఇది తన దురదృష్టం మరి. ఆవిడకు ఇద్దరే కొడుకులు. ఆ ఇద్దరికీ తల్లంటే ప్రేమ, అభిమానం, ఆపేక్ష ఉన్నాయి. సంవత్సరంలో పది నెలలు పెద్దకొడుకు దగ్గిరే ఉండి పోతుం దామె. 'ఇంకా వెళ్ళదే' అని కొడుకు గాని, కోడలు గాని విసుక్కోరు. చిన్న చూపు చూడరు. పైగా పెద్దహోదాలో ఉన్న కొడుకు తల్లిని పువ్వుల్లో పెట్టినట్లు చూసుకుంటాడు. "నేనింత ఉన్నత దశలో ఉండటానికి మా అమ్మే కారణం. ఆమె నిరాదరణగా చూస్తే నేనింత ఉన్నత స్థితిలో ఉండేవాడినే కాదు" అని అందరి దగ్గిరా తల్లిని పొగుడుతూ ఉంటాడు కూడా. ఇక ఆ కోడలైనా విసుక్కోదు. ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా చూస్తుంది అత్తగార్ని. ఏ విషయం లోనూ వెలితిగాని, కొరతగాని

(తరువాయి 39 వ పేజీలో)



## ఈ కన్నీటికి...

(35 వ పేజీ తరువాయి)

లేకుండా చూసుకునే వాళ్ల దగ్గర ఉండటానికి ఆమెకు బాధేమిటి?

"నీ ప్రయాణం ఆగిపోయినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది, వదినా—" నోటినిండా నవ్వుతూ చెప్పింది కామాక్షమ్మ.

పిల్లికి చెలగాటం ఎలకకి ప్రాణ సంకటమట. అలా ఉంది ఇప్పుడు తన ప్రయాణం ఆగిపోయినందుకు. కాని ఈమె కేమో సంతోషంగా ఉందట. ఆ సమయంలో కామాక్షమ్మ మీద ఎప్పుడూ రానంత కోపం వచ్చింది. కోపాన్ని దిగమింగుతూ, "ఎందుకుటా" అంది వ్యంగ్యంగా చూస్తూ.

"ఎందుకేమిటి? వచ్చేది ధనుర్మాసమూ—రామాలయంలో ఎంత సందడిగా ఉంటుందనుకున్నావూ! రోజా కో అలంకారం చేస్తారు. పైగా హరికథలకు, పురాణ కాలక్షేపాలకు లోటే ఉండదు. ఆ నెలంతా చాలా సందడిగా, హడావిడిగా ఉంటుందిలే. నువ్వుండవేమో, నాకు తోడెవరుంటారూ అని బాధ పడుతుంటే దేవుడు నా మొర విని నీ ప్రయాణం ఆపేశాడు. వర్లే గాని, అలా ఉన్నావేమిటి, వదినా, దిగులుగా? పాపం, హైదరాబాదు చూడాలని చాలా ఉబలాటపడ్డావుకదూ? కాని, ఏం చేస్తావు? ఒక్కోసారి ఇంతే. ఎంతో ఆశపడితే, ఆశ నిరాశగా మారి పోతుంది క్షణంలో." తన ధోరణిలో తను చెప్పుకు పోతున్నది కామాక్షమ్మ.

కాని, నరసమ్మగారి మనసు మాత్రం పెద్ద కొడుకు ఉంటున్న హైదరాబాదు చుట్టూ పరిభ్రమిస్తున్నది. అది చాలా పెద్ద ఊరట. పెద్ద పెద్ద మేడలు, విశాలమైన రోడ్లు, తోటలు—చూడవలసిన ప్రదేశా లెన్నో ఉంటాయిట. హైదరాబాదు గురించి వాళ్లూ వీళ్లూ అనుకునే మాటలతో మనసులో అందమైన రూప కల్పన చేసుకుంటూ మురిసి పోయింది ఇన్నాళ్లూ, త్వరలో అక్కడి కెళ్లబోతున్నాను కదూ అనే భ్రమలో.

చిన్నప్పట్నుంచీ కూడా పెద్ద పెద్ద నగరాలను చూడాలనే కాంక్ష వయసుతో పాటు పెరుగుతూ వస్తున్నది కాని, ఊహాలోకాల్లో ఊరించే ఆ నగరాలను తను ఇంతవరకు చూడనేలేదు. పల్లెటూర్లో పుట్టి, మరో పల్లెటూర్లో మెట్టింది. దగ్గర ప్రయాణం కారు మీద, లేదా ఎడ్లబండి మీద. అంతే. రైలుమీద దూర ప్రయాణం ఎప్పుడూ చేసి ఎరగదు. కొడుకులు ఉద్యోగస్థు లయ్యాకన్నా వాళ్ల దగ్గర కెళ్లడం పడేది కాదు. ఇప్పుడంటే భర్త పోబట్టి, భర్త పోతూ పోతూ ఏర్పాటుచేసిన విధంగా తన పొట్టకి ఇంత ముద్దకోసం కొడుకుల దగ్గరకు వెళ్లవలసి వస్తున్నది.

పెద్దకొడుక్కి హైదరాబాదు ట్రాన్స్‌ఫ రయిందని తెలిసినప్పటినుంచి, పైకి చెప్పక పోయినా లోలోపల ఎంత మురుస్తున్నదో ఎవరికి తెలుసు? ఎప్పుడెళ్లి ఆ ఊరు చూద్దునా అని వేగిర పడుతుంటే, పెద్దకొడుకు ఆ దారినే మూసివేశాడు.



ప్రసాధనం

చిత్రం—ఆర్. సుమలత (మద్రాసు-23)

అసలు పెద్దాడు అంత ప్రయోజకుడవడానికి కారణం తనే. ఆ రోజుల్లో తనే గాని వాడి చదువు గురించి పట్టు పట్టకపోతే, వాడూ తమ్ముళ్లలాగే ఏ గుమాస్తాగానో, స్కూలు మాస్టారుగానో బతికే వాడే. కాని, వాడి చదువు కోసం తమ మొగుడితో పోట్లాడేది— "వాడిని మీరు బాగా చదివించవలసిందే" అని. తన పట్టుదలకి తగ్గట్టుగానే ఒక్క క్లాసూ తప్పకుండా పాసవుతూ వచ్చాడు. చదువుకి తగ్గ పెద్ద ఉద్యోగం చేస్తున్నా డిప్పుడు. రెండో వాడు, మూడో వాడు ఎస్. ఎస్. ఎల్.సి. తోనే సరిపెట్టుకున్నారు. పెద్దాడి చదువుతోనే గుడ్లు మీదికొచ్చినంత పనయి తతిమ్మా వారిని పెద్ద చదువులు చదివించలేనన్నాడు భర్త. రెండో వాడు గుమాస్తా, మూడో వాడు బడిపంతులూ అయ్యారు. ఎటొచ్చీ నాలుగోవాడికే అన్యాయం జరిగి పోయింది, పాపం! "అన్నయ్యల్లా నేనూ చదువుకుంటాను" అని ఎంతో గోల పెట్టాడు కాని, వాడి ఏడుపు తను గాని, భర్తగాని పట్టించుకుంటే కదూ? "అందరూ చదువుకుంటే నాన్నకి పొలం పనుల్లో ఎవరు సాయం చేస్తార్రా" అని వాడిని బతిమాలి, బామాలి ఎలాగైతేనేం వాడి మెడలు విరిచి వ్యవసాయంలోకి దింపింది తనేను. కాని, తనకేం తెలుసు— చదువులు మమకారాలని దూరం చేస్తాయని, డబ్బుకి ప్రాధాన్య మిస్తాయనీను? హఠాత్తుగా ఆమె ఆలోచనలకు సడన్ బ్రేక్ పడింది. కామాక్షమ్మ ఆమె భుజం పట్టుకుని ఆపుతూ—"ఇక్కడ కొబ్బరికాయ, అగరొత్తులు కొందాము ఆ గొదినా" అంది. "గుడి దగ్గరైతే ప్రియంగా చెబుతారు, నువ్వు కొంటావా కొబ్బరికాయ? డబ్బులున్నాయా — లేక పోతే నేను తెచ్చాను, తీసుకో. ఇంటి దగ్గ రిద్దువుగానిలే" అంది.

తన దగ్గర డబ్బు ల్లేనందుకు ఆ సమయంలో నరసమ్మగారు చాలా సిగ్గుపడింది మనసులో. అసలు తన దగ్గర చిల్లర డబ్బులుంటే కదూ తేవడానికి? ఎప్పుడన్నా ఇలా గుడికి బయలు దేరుతుంటే, ఆ సమయానికి కొడుకు ఇంట్లో ఉంటే— "ఓ పావలా ఉంటే ఇవ్వరా" అని అడిగి తెచ్చేది కాని, ఏమిటో ఈ రోజు మనసు మొద్దుబారిపోయింది. ఏదీ జ్ఞాపకం రాలేదు తనకి. కామాక్షమ్మ కైతే అడిగే బాధే ఉండదు— జీతాలు రాగానే కొడుకు ఆమె చేతి ఖర్చు కోసం పదో, ఇరవైయో ఇస్తాడట. ఆ మాట ఎంతో గర్వంగా చెబుతుంది కామాక్షమ్మ. చెప్పుకోవడానికి తనకీ నలుగురు కొడుకు లున్నారు కాని, ఒక్కళ్లూ తమంత తాముగా — 'ఈ రూపాయి దగ్గరుంచుకో, అమ్మా' అని ఇవ్వరు. అడగడం తనకి నామోషీగా ఉంటుంది. తనకి కొనిచ్చే ఒక్క చీరా కొనిపెట్టడానికే వాళ్ల కెంతో బాధగా ఉంటుంది— "నీ దగ్గర చీరలు మన్న వేమిటమ్మా" అని విసుక్కుంటారు. భార్యలకైతే పండుగ పండుక్కీ కొత్త చీరలు కొంటూనే ఉంటారు. తమ జన్మకి కారణభూతురాలైన తల్లికి ఒంటినిండా బట్టా, కడుపునిండా తిండీ పెట్టడానికి ఈ కొడుకు లింత బాధపడిపోతా రెందుకనో?

కామాక్షమ్మ గీసి గీసి బేరమాడి ఓ కొబ్బరి కాయ తీసుకుంది. "నువ్వు కొబ్బరికాయ తీసుకుంటావా, అరటి పండ్లా?" అడిగింది నరసమ్మగార్ని.

"అరటిపళ్లు చాలులే" అని కామాక్షమ్మ దగ్గర పది పైసలు తీసుకుని పళ్లు తీసుకుంది నరసమ్మగారు.

"నేను బయటి కెళుతున్నానంటే చాలు, 'ఈ డబ్బులు దగ్గరుంచుకోండి, అత్తయ్యా' అని నే వద్దంటున్నా వినకుండా ఇస్తుంది మా కోడలు." చూశావా నా అదృష్టం, నా కోడ లెంత మంచిదో? నీకూ ఉన్నారు కోడళ్లు కాని, ఒక్కళ్లకూ నీ పొడ గిట్టదు, పాపం అన్నట్లు బడాయిగా చెబుతున్నది కామాక్షమ్మ. ఆవిడ మాటలకు మొహం ముడుచుకుంది నరసమ్మగారు.

మూడో కొడుకు దగ్గరుండగా ఒకసారి ఇలాగే ఎదురింటి శివమ్మగారితో కలిసి బజారు వెళ్లింది. ఆ శివమ్మగారు ఇంట్లోకి కావలసిన వెచ్చాలన్నీ తనే తెస్తుంటుంది. అది చూసి కోడలు తనని కూడా ఏవో సరకులు తెమ్మని పురమాయిస్తూనే ఉండేది. తనకి కావలాగా రెండో కూతుర్ని పంపేది కూడా. ఓసారి అడుక్కునే వాడికి రెండు పైసలు వేసింది. దాహం వేసిందని సోడా తాగింది. ఆ కబురుని తల్లికి జాగ్రత్తగా చేరవేసింది కూతురు. అంతే. ఆవిడ మాటీ పోటీ మాటలు వినరడం మొదలు పెట్టింది.

"ఎవర్నే మీ అమ్మ అలా తిడుతున్న" దని కొడుకు కూతుర్ని అడుగుతుంటే, ఆ కూతురు ఏదో ఘనకార్యం చేసిన దానిలా పోటీస్తూ, "ఇందాకా బామ్మ అమ్మఇచ్చిన డబ్బులు మిగిల్చి సోడాతాగింది. అడుక్కునే వాడికి వేసింది—అందుకనే అమ్మకి కోపం వచ్చింది, నాన్నా" అంది. "ఏడ్చావులే, నోరుమూసుకో" అని కూతుర్ని కసిరాడు కొడుకు. ఆ మాట



ఏ వేళకు ఆ వైపు

ఫోటో—పి. జయదేవరెడ్డి (నంగమంగలం)

వింటూనే తను బిక్కచచ్చిపోయింది. తన కొడుకు ముందు అపరాధిలా నిలబడి పోయింది తను.

అంటే, తల్లి కొడుకు సంపాదనలో అర్ధణా కూడా ఖర్చు పెట్టుకునే హక్కు లేదా? అని బాధగా మూలిగింది తన మన సప్పుడు. చిన్నప్పుడు పుస్తకాలు పారేసి, పలకలు పగలగొట్టి, పెనిసిళ్ళు, పెన్నులు పారేసి ఆ సంగతి తెలిస్తే తండ్రి ఎక్కడ తన్నుతాడో అనే భయంతో బిక్కమొహం వేసుకుని తన దగ్గర నిలుచుంటే, తన మనసు కరిగి పోయేది. భర్తకి తెలియకుండా వాళ్ళకి డబ్బులిచ్చి పంపేది. అలా ఎన్నిసార్లో, ఎన్ని రూపాయలు ఖర్చు పెట్టిందో అదంతా తన కొడుకులకి తెలియదూ— అనుకునేది బాధగా.

ఓ సారి—అంటే అప్పటికి భర్త బ్రతికే ఉన్నాడు, "ఆడదానికి కూడా తనదంటూ ఇల్లో, పొలమో, బంగారమో ఉండాలి. దానికోసమైనా కొడుకులూ, కోడళ్ళూ వృద్ధాప్యంలో బాగా చూస్తారు. ఏమీ లేకపోతే ఆ ఆడదాన్ని ఎవరూ సరిగ్గా ఆదరించరు కూడా" అని ఎవరో అంటే ఆ మాట మీద తను తనపేరన కొంత భూమి పెట్టమని పోరింది. కాని, భర్త వింటే కదూ? "నీ కెందుకే, పిచ్చి దానా, ఆస్తి! ఆస్తినుప్వేం చేసుకుంటావు? ఆస్తిని మించిన కొడుకులు నలుగురు ఉండగా, వాళ్ళు నీ కేం లోటు చేస్తారు? నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకోరూ?" అని ఉన్న ఆస్తి కాస్త ఆ నలుగురికే పంచి పెట్టేశాడు. "అదేమిటి, నాన్నా, అమ్మని మేము చూసుకోమా, మా కంతగా చెప్పాలా?" అని ఆ రోజు తండ్రి ముందు గొప్పలు చెప్పుకున్న ఆ కొడుకులే, ఇప్పుడు తనకి ముద్ద పెట్టడానికి బాధపడిపోతున్నారు.

పుత్రులు లేకపోతే పుట్టగతు లుండ వని, పున్నామ నరకం నుంచి కాపాడేది కొడుకులే కాని కూతుళ్ళు కాదు అనే మూఢ నమ్మకంతో కొడుకులు పుట్టా లనే కోరుకుంటుంది ఆడది. వృద్ధా ప్యంలో ఆదరించవలసిన కొడుకు, చివ రకు వాళ్ళ కేమిస్తున్నాడు? తీరని ఆశాం తిని, బ్రతుకుమీద విరక్తిని కలిగి స్తున్నాడు. అంతే. బ్రతికి ఉండగానే నరకాన్ని చవి చూపించే కొడుకు పుట్టినా ఒకటే, పుట్టకపోయినా ఒకటే. కొడుకుల స్వభావాలను తలుచుకుంటూ చింతి స్తున్నది ఇప్పుడు నరసమ్మగారు.

'ఆ కొడుకుల్ని చూసే ఒకానొక నాడు తెగ గర్వపడ్డావు కదూ?' చిలిపిగా అడిగింది మనసు.

'అవును. గర్వపడ్డ మాట నిజమే. ఒక్క కొడుకు పుట్టితేనే బోలెడంత సంతోషం కలిగేటప్పుడు నాకు నలుగురు కొడుకు లున్నారు, నాకు లోటేమిటి? ఒకరితో లెక్కేమిటి అని విర్రవీగిన మాట నిజమే కాని, నాకేం తెలుసు, స్వార్థానికి మారుపేరుగా తయారవుతారు ఈ కొడుకులు అని?' పశ్చాత్తాపంతో తనకి తను సమాధానం చెప్పుకుం దామె—

"ఏమి టొదినా అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు? ఎన్నిసార్లు పిలిచినా పలకడం లేదు" అంది కామాక్షమ్మ.

"పిలిచావా!" కలవరపాటుని అణుచు కుంటూ పొడిగా అంది నరసమ్మగారు.

"ఈ రోజు నీ మనసు బాగాలేదు. చాలా పరధ్యాన్నంగా ఉన్నావు." నవ్వింది కామాక్షమ్మ.

• • •

పురాణం దగ్గరినుంచి ఇంటికి బయలు దేరుతూ, "రేపు ఇంతకంటే పెందలాడే వద్దాము, వదినా" అంది కామాక్షమ్మ.

"రేపు నే నుండనమ్మా." నిర్లిప్తంగా జవాబిచ్చింది నరసమ్మగారు.

"ఎక్కడి కెళతావూ? నీ ప్రయాణం ఆగిపోలేదూ!?"

"నా ప్రయాణం ఆగదమ్మా—మా ఆఖరి వాడు విష్ణుమూర్తి దగ్గరి కెళ తాను."

"మూణ్నెల్ల క్రితం అక్కణ్ణుంచేగా వచ్చావూ? మళ్లీ అక్కడికే వెళతావా?" సంభ్రమాన్ని వెల్లడించింది కామాక్షమ్మ.

'అవును, అక్కడైతేనే నాకు సుఖంగా, నిశ్చింతగా ఉంటుంది. చదువు కున్న కొడుకులు ఏదో ఉద్ధరిస్తారని ఆశపడుతూ వచ్చాను కాని, డబ్బు ముందు కన్నతల్లి కనిపించదని ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను' అని పైకి అన కుండా మనసులో అనుకున్నా రావిడ.

అత్తగారికోసం కనిపెట్టుకుని కూర్చున్న కోడలు మొహం చిట్లించి లేచింది, ఆవిడకు ఫలహారం పెట్టడాని కని. భర్త పోయినప్పట్నుంచి ఒంటి పూటే భోజనం చేస్తుం దామె.

కోడలి మొహంలోని విసుగుని, కొడుకు కన్నుల్లో ప్రస్ఫుటమయ్యే కోపాన్ని అర్థం చేసుకున్న నరసమ్మగారు వంట ఇంట్లోకి వెళ్లకుండా తనకు వేసిన పక్కమీద కూర్చుంటూ, "ఒరేయ్, సూర్యం, రేప్పొద్దున్న ఫస్టు బస్సుకి పాలెం వెళతారా" అంది. ఆ మాటకి కొడుకు — 'అక్కడి కెందుకు? ఆ ఉండేదేదో ఇక్కడే ఉండరాదా' అంటా డేమో అనే ఆశతో. కాని, సూర్యం — "అలాగే, నీ ఇష్టం" అనేశాడు అతి తేలిగ్గా.

అత వలా అనగానే ఆమెకు చాలా ఆశాభంగం కలిగినట్లయింది.

ఆ రాత్రి ఎంతసేపటికీ ఆమెకు నిద్రపట్టలేదు. ఎలా పట్టుతుంది నిద్ర? కొడుకుల అండలో తన చివరి రోజులు నిశ్చింతగా గడిచిపోతాయని గంపె డాశతో ఉంది. కాని, స్వార్థం మూర్తీభ వించిన కొడుకుల ప్రవర్తనకు దుఃఖం వస్తున్న దామెకు.

'ఆడది సంతానంకోసం ఎంతో ఆర్రులు చాస్తుంది. సంతానంకోసం చేయరాని పూజలు, వ్రతాలు, తీర్థ యాత్రలు కూడా చేస్తుంది. పుట్టిన సంతానం నిలబడటంకోసం ఎంతో సుఖాన్ని పణంగా ఒడ్డుతుంది. ప్రతి క్షణమూ ఆ కొడుకు ఔన్నత్యంకోసమే వెంపరలాడుతుంది—కాని, పెరిగి ప్రయో జకు డైన కొడుకు ఆ తల్లి కేమిస్తాడు బదులుగా? కన్నీరు ... కన్నీరు ... కన్నీరు ... అంతే.' అంతర్గతమైన వేదనతో ఆమె రాత్రంతా జాగరణ చేసింది.

అప్పుడే కాస్త కునుకు పట్టుతున్న దామెకు. కాని, సూర్యం గొంతు హడా విడిగా వినిపించింది. "అమ్మ ఇంకా లేవ లేదూ? ఈ బస్సు దాటిపోతే మళ్లీ ఏడు గంటల వరకూ బస్సు లేదు కూడా. అమ్మని లేపు, కనకం" అంటున్నా డతను. అంతే. అతి బలవంతంగా లేచి కూర్చుం దామె. 'నే నిక్కడ ఒక్కపూట ఆగినా బరువేనేమో' అనుకోగానే ఆమెకు కన్నీ రాగింది కాదు. అప్పుడే లోపలి కొచ్చిన సూర్యం తల్లి కళ్లవెంబడి నీరు రావడం చూసి కంగారు పడ్డాడు. "ఏడుస్తున్నా వెందుకమ్మా? అన్నయ్య అలా రాశా డనా?" అడిగాడు కంపిత స్వరంతో.

"కాదురా, పిచ్చీ! రాత్రి కలలో మీ నాన్నగారు కనిపించారు. ఆయన జ్ఞాపకం వస్తే కన్నీ రాగింది కాదు" అన్నా రావిడ, పైకి నవ్వు నటిస్తూ. కాని, మనసులో ఇలా అనుకున్న దామె: 'ఈ కన్నీటికి అర్థం నీ కిప్పుడు తెలియదురా. ఇప్పుడు నువ్వు అపురూపంగా చూసుకునే నీ బిడ్డలు పెద్దయ్యాక వాళ్ళు నిన్ను నిర్లక్ష్యం చేస్తున్నప్పుడు, ఈ కన్నీటికి అర్థం తెలుస్తుంది నీ కప్పుడు.'

"పద, టైమయింది కాబోలు" అంటూ తడి కళ్ళను తుడుచుకుని మూలుకుంటూ బయటి కొచ్చింది నరసమ్మగారు. ★